# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 27 - ఆగస్టు - 2026 | సంపుటి : 4 | సంచిక : 84 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు కార్యాచరణ సిద్ధం

- గ్లోబల్ సమ్మిట్ 2.0 ఏర్పాట్లపై సమీక్ష
- పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక ప్రణాళిక
- ప్రజాభవన్‌లో వార్ రూమ్ ఏర్పాటు
- రోజువారీ పర్యవేక్షణకు ఆదేశాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**

డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 విజయవంతానికి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జరిగిన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో సమ్మిట్ ఏర్పాట్లు, పెట్టుబడుల ఆకర్షణకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రానికి భారీ స్థాయిలో దేశీయ, విదేశీ పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారు. సమ్మిట్ నిర్వహణ కోసం ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. అలాగే నిపుణులు, ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలను స్పష్టంగా విభజించాలని ఆదేశించారు. ప్రతి కమిటీ నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత తెలంగాణ రైజింగ్ సమ్మిట్ సందర్భంగా కుదిరిన అవగాహన ఒప్పందాల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

మిగతా 2లో..

# భూముల విధానంపై హరీశ్ రావు విమర్శలు

- 22ఏ బాధితులకు అండగా ఉంటామని భరోసా
- ప్రభుత్వ భూముల విక్రయాలపై ఆందోళన
- కూకట్‌పల్లిలో బాధితులతో సమావేశం
- ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచన





**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ విధానాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కూకట్‌పల్లిలో 22ఏ నిషేధిత జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులతో సమావేశమైన ఆయన, వారి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు, ప్రభుత్వ ప్రధాన బాధ్యత ప్రజలకు విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, ఉపాధి వంటి మౌలిక సేవలను అందించడమేనని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యల


మిగతా 2లో..



# కంటైనర్‌ను ఢీకొన్న బస్సు.. ఆరుగురు మృతి

- సూర్యాపేట జిల్లాలో తెల్లవారుజామున ఘోర ప్రమాదం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ఇరవై మందికి తీవ్ర గాయాలు
- హైదరాబాద్–ఏలూరు బస్సుకు విషాదం

2లో







# గోదావరిలో ఉద్ధృత వరద.. పోలవరం అప్రమత్తం

- పోలవరం వద్ద పెరిగిన ప్రవాహం
- 48 గేట్ల ద్వారా భారీ నీటి విడుదల
- గండిపోశమ్మ ఆలయాన్ని చుట్టుముట్టిన వరద
- పాపికొండల బోటు యాత్రలకు బ్రేక్

**రాజమహేంద్రవరం, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నదిలో వరద ఉద్ధృతి పెరిగింది. భారీగా చేరుతున్న వరద నీటితో పోలవరం ప్రాజెక్టు వద్ద ప్రవాహం తీవ్రతరమవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద

మిగతా 2లో..



# అభివృద్ధి అంశాలపైనే భట్టితో భేటీ

- కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నానన్న ఎమ్మెల్యే
- పార్టీ బలోపేతమే తన లక్ష్యమని స్పష్టం
- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ధ్యేయమన్న వ్యాఖ్య

**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన భేటీపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కేటాయింపులు, ప్రజా సమస్యల పరిష్కారంపైనే చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ భేటీకి రాజకీయ ప్రాధాన్యత లేదని, అభివృద్ధి కార్యక్రమాల కోసమే

మిగతా 2లో..



# ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే అండ

- కేంద్రం నుంచి నిధులు రాలేదని మంత్రి ఆవేదన
- పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం
- బిల్లుల చెల్లింపులకు చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**

పేదల సొంతింటి కలను సాకారం చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందకపోయినా తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి కేంద్ర

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కంటైనర్‌ను ఢీకొన్న బస్సు.. ఆరుగురు మృతి

**సూర్యాపేట, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** సూర్యాపేట జిల్లాలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు మృతి చెందగా, మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ మండలం దొరకుంట శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన కంటైనర్ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరుకు 42 మంది ప్రయాణికులతో బయలుదేరిన ప్రైవేటు బస్సు దొరకుంట సమీపానికి చేరుకున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని డ్రైవర్ గమనించకపోవడంతో వేగంగా వెళ్లి ఢీకొట్టినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదం తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.

ప్రమాద సమయంలో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రలో ఉండటంతో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొంది. మృతుల్లో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు అధికారులు గుర్తించగా, మరో వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.



మృతుల గుర్తింపునకు పోలీసులు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లలో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని వైద్య వర్గాలు తెలిపాయి.

ప్రమాదంలో బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమించాయి. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమా, కంటైనర్ నిలిపివేతలో నిబంధనల ఉల్లంఘన జరిగిందా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# గోదావరిలో ఉధృత వరద.. పోలవరం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

గోదావరి నీటిమట్టం 30.30 మీటర్లకు చేరుకోగా, స్పిల్‌వే వద్ద 30.20 మీటర్లుగా నమోదైంది. వరద ప్రవాహాన్ని నియంత్రించేందుకు స్పిల్‌వేకు చెందిన 48 గేట్లను ఎత్తి దిగువకు సుమారు 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

వరద ప్రభావం దేవీపట్నం మండలంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రసిద్ధ గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు, చుట్టుపక్కల ఉన్న దుకాణాలు నీట మునిగిపోయాయి. పి.గొందూరు నుంచి నాగులపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గండిపోశమ్మ ఆలయానికి భక్తుల రాకకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలను ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు.

గోదావరి నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి ఇంకా భారీగా వరద నీరు వస్తుండటంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదీ తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రలకు సంబంధించిన బోటు సర్వీసులను నిలిపివేసే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునే వరకు పర్యాటక కార్యక్రమాలపై పరిమితులు కొనసాగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# అభివృద్ధి అంశాలపైనే భట్టితో భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమైనట్లు పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న సీనియర్ నాయకుడినని రాజగోపాల్ రెడ్డి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. 2018 ఎన్నికల్లో అనేక మంది సీనియర్ నాయకులు ఓటమి పాలైనప్పటికీ మునుగోడు ప్రజలు తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతం, కార్యకర్తల ప్రయోజనాల కోసమే తన వ్యాఖ్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగత విమర్శలు చేయడం తన ఉద్దేశం కాదన్నారు. ఎన్నికల సమయంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి అవకాశాలు కల్పించినప్పటికీ, పార్టీని నమ్ముకుని పనిచేసిన కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని అభిప్రాయపడ్డారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అంతిమమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పందించారని, క్రమశిక్షణ సంఘం కూడా సంబంధిత అంశాలపై నివేదిక సమర్పించినట్లు తెలిపారు. పార్టీ నిర్ణయాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. తనపై విమర్శలు చేస్తున్న వారు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని రాజగోపాల్ రెడ్డి సూచించారు. తాను ఎప్పటికీ పార్టీ క్రమశిక్షణను పాటిస్తానని, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానని చెప్పారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని రాజగోపాల్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చూడాలన్నదే తమ ఆశయమని, ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు కార్యాచరణ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడిదారులతో కొనసాగుతున్న ప్రాజెక్టుల స్థితిగతులను పరిశీలించి, అమలులో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత రోడ్‌షోలు నిర్వహించి తెలంగాణ పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు, బహుళజాతి సంస్థలు, పెట్టుబడిదారులకు ఆహ్వానాలు పంపే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా నిలపడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై రోజువారీ సమీక్షలు నిర్వహించి, ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ సమ్మిట్ కీలక వేదికగా నిలవనుందని ఆయన పేర్కొన్నారు.

# భూముల విధానంపై హరీశ్ రావు విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారం కంటే భూముల వ్యవహారాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. భూముల చుట్టూ తిరిగే పరిపాలన ప్రజలకు ఉపయోగపడదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతానికి ప్రాధాన్యం ఇచ్చామని హరీశ్ రావు పేర్కొన్నారు. మిషన్ భగీరథ, నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి ప్రాజెక్టులు, బస్తీ దవాఖానాలు, ఆసరా పింఛన్లు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ప్రభుత్వ భూములు భవిష్యత్ తరాలకు చెందిన ఆస్తులని, వాటిని విచక్షణారహితంగా విక్రయించడం సరైంది కాదని ఆయన అన్నారు. హైదర్‌నగర్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని కూడా



అమ్మకానికి పెట్టారని ఆరోపిస్తూ, భవిష్యత్ అవసరాలకు ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 22ఏ జాబితాలో భూములు చేర్చడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి కొనుగోలు చేసిన భూములపై ఆంక్షలు విధించడం వల్ల ప్రజలు ఆర్థిక, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో 22ఏ బాధితులు తమ సమస్యలను హరీశ్ రావు దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను సంబంధిత వేదికల్లో ప్రస్తావించి పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేత హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే అండ

(మొదటి పేజీ తరువాయి)




ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ఏడాదికిపైగా ఎదురుచూశామని మంత్రి తెలిపారు. పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ఇళ్లను మంజూరు చేయాలని అనేక సందర్భాల్లో కోరినట్లు చెప్పారు.

2014 నుంచి 2023 వరకు గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని మంత్రి పేర్కొన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణంపై భారీ డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న ఆశతో ఇప్పటికే పూర్తయిన ఇళ్లకు సంబంధించిన చివరి బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పలుమార్లు కలిసి తెలంగాణకు ఇళ్ల మంజూరు చేయాలని కోరినట్లు వెల్లడించారు. ఇటీవల పార్లమెంట్ సభ్యులతో కలిసి తాము కూడా కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ సానుకూల స్పందన రాలేదని పేర్కొన్నారు. ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు చివరి బిల్లుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం తన బాధ్యత నిర్వర్తించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల తన బాధ్యతను నెరవేరుస్తుందని చెప్పారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా పేదల సంక్షేమం విషయంలో వెనక్కి తగ్గబోమన్నారు. పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్**
- **ప్రజల నుంచి అర్జీల స్వీకరణ**
- **సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికలు**
- **ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా చర్యలు**

**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వీ. హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.



మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న "ప్రజావాణి" కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కార చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరాభవన్, గాంధీభవన్ వేదికగా ప్రతి వారం "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులను ఆహ్వానించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారని వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, పింఛన్లు, విద్య, ఆరోగ్యం, ఉపాధి తదితర అంశాలపై వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని వీ. హనుమంతరావు తెలిపారు. ప్రజలు కూడా తమ సమస్యలను సరైన పద్ధతిలో ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వినతులను సమర్పించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఘనంగా మదర్ థెరిస్సా జయంతి



**కాజీపేట్ ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** పునీత మదర్ థెరిస్సా 116వ జయంతి ని పురస్కరించుకుని కాజీపేట్ లోని ఫాతిమా నగర్ లో ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఫాతిమా జంక్షన్ వద్దనున్న మదర్ థెరిస్సా విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేశారు. చర్చి ఫాదర్ మర్రెడ్డి ప్రార్థనలతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఫాతిమా క్యాథలిక్ చర్చి ఫాదర్ కాసు మర్రెడ్డి మాట్లాడుతూ భారత రత్న అవార్ గ్రహిత అయిన మదర్ థెరిస్సా చూపిన ప్రేమ మార్గంలో నడిచి వారి ఆదేశాలను సేవ దృపదంతో నడిచినచో మనమందరము వారికి నిజమైన నివాళులర్పించిన వారమవుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ కన్వీనర్ ఆర్. రామ్మోహన్ రావు, అల్లం ప్రకాశ్ రెడ్డి, బాలశౌరెడ్డి, ఎం. జ్ఞాన ప్రకాష్, బి. దయాసాగర్, మత్యాస రెడ్డి,సుధాకర్ రెడ్డి, బి. ప్రభాకర్, కన్యలు ,బ్రదర్స్ లతోపాటు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

- **పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి**



**పెద్దమందడి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి కోసం అమలు చేస్తున్న ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకాన్ని అర్హులైన బీసీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ పథకానికి బీసీ మహిళలు మాత్రమే అర్హులని, 18 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన మహిళలు అవసరమైన ధ్రువపత్రాలతో అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు పెద్ద పీట వేస్తోందని వెంకటస్వామి అన్నారు. బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఘనంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అన్ని పార్టీలకు చెందిన కార్పొరేటర్లు సమష్టిగా వేడుకలను నిర్వహించి, మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో కేక్ కట్ చేయించారు.ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు మేయర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. నగర అభివృద్ధికి మేయర్ చేస్తున్న కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు పాల్గొని మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పాము కాటుకు గురైన వ్యక్తికి సకాలంలో వైద్యం



**పెనుబల్లి, ఆగస్టు 26(తెలంగాణ ముచ్చట్లు):** పాము కాటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తికి సకాలంలో అత్యవసర వైద్యం అందించి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పెనుబల్లి మండలం పాత కారాయిగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. లంకపల్లి గ్రామానికి చెందిన కొమ్ముగిరి రాములు (45) బంధువుల ఇంటికి వస్తున్నక్రమంలో మార్గమధ్యలో పాము కాటుకు గురయ్యాడు. అనంతరం పాత కారాయిగూడెంలోని బంధువుల ఇంటికి చేరుకున్న రాములు.. తనను పాము కరిచిందని చెప్పి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న సత్తుపల్లి 108 సిబ్బంది (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) గొల్లమందల కృష్ణ, పైలట్ కట్టం మహేష్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాములు సమీపంలో పాము చనిపోయి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే రాములను 108 అంబులెన్స్‌లోకి ఎక్కించి అత్యవసర వైద్య సేవలు అందిస్తూ పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిని పాత కారాయిగూడెం గ్రామస్థులు అభినందించారు. ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్, జిల్లా మేనేజర్ ఆలేటి ప్రణయ్‌కుమార్ సిబ్బందిని అభినందించారు.

# చొప్పదండిలో స్వేరో జ్ఞాన సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

- **యువతకు మంచి సందేశం అందించడమే లక్ష్యం**




**కరీంనగర్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** చొప్పదండి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో స్వేరో పట్టణ అధ్యక్షుడు కొత్తూరు శ్రవణ్ ఆధ్వర్యంలో స్వేరో జ్ఞాన సమ్మేళనం పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జ్ఞాన సమ్మేళనం ద్వారా యువతకు మంచి సందేశాన్ని అందించడంతో పాటు వారిలో చైతన్యం, స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.
ఈనెల 30న గంగాధరలో జ్ఞాన సమ్మేళనం గంగాధరలో ఈనెల 30న నిర్వహించనున్న స్వేరో జ్ఞాన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు గంగరాజు, కల్లెపెల్లి అరవింద్, వడ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కోదండ రామాలయం భూమి పూజలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** మల్యాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కోదండ రామాలయం నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగాలని, ఆలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పల్లవి, శివశంకరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**పెద్దమందడి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి గ్రామానికి చెందిన ముంత రాములు, సుజాతల కుమార్తె పల్లవి వివాహం మోజర్ల గ్రామంలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన దంపతులు పల్లవి, శివశంకర్‌లను ఆశీర్వదించారు .ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు. పరస్పర అవగాహన, ప్రేమాభిమానాలతో జీవితాన్ని ఆనందంగా కొనసాగించాలని సూచించారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, ఆంధ్రజ్యోతి వనపర్తి స్టాఫ్ రిపోర్టర్ భాస్కర్ యాదవ్, పెద్దమందడి సింగిల్ విండో వైస్ చైర్మన్ కుమార్ యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు గట్టు నాయుడు, జానంపేట బుచ్చన్న, కొండన్న యాదవ్, రామచంద్రి యాదవ్, రాజవర్ధన్‌రెడ్డి, ముంత జగన్ యాదవ్, తిరుపతి నాయుడు తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వివాహ వేడుకల్లో ప్రణవ్ బాబు, సుహాసిని

- **వధూవరులకు ఆశీర్వాదం**



**హుజురాబాద్,ఆగష్టు 26(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ వొడితల ప్రణవ్ బాబు గారు, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు గారు పలు వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకలకు వారు హాజరై వధూవరులను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి, నూతన దాంపత్య జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ నూతన దంపతుల జీవితం ప్రేమ, అనురాగం, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర గౌరవం, ఆప్యాయతతో ముందుకు సాగుతూ ఆదర్శ దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని కోరారు. సుహాసిని మనోజ్ రావు గారు కూడా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి కుటుంబాల్లో ఎల్లప్పుడూ ఆనందం, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వివాహ శుభకార్యాల్లో పాల్గొన్న సందర్భంగా వధూవరుల కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు ప్రణవ్ బాబు, సుహాసిని మనోజ్ రావు దంపతులను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వివాహ వేడుకల విశేషాలను తెలుసుకున్నారు. అనంతరం నూతన దంపతులను ఆశీర్వదించి, వారి భవిష్యత్ జీవితం సుఖమయంగా ఉండాలని ఆకాంక్షించారు.
ప్రజలతో మమేకమవుతూ ప్రతి కుటుంబ వేడుకలో భాగస్వాములవుతున్న ప్రణవ్ బాబు, సుహాసిని మనోజ్ రావు దంపతుల పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. వివాహ వేడుకల్లో వారి పాల్గొనడం కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది.
ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్లు, మండల ప్రెసిడెంట్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఓనం వేడుకల్లో అలరించిన ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు

- **కేరళ సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబంగా ఘనంగా వేడుకలు**

**కరీంనగర్,ఆగష్టు 26(తెలంగాణ ముచ్చట్లు ):** కేరళ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఓనం పండుగను పురస్కరించుకుని ఎస్ఆర్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.
కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీ అనుష్ రెడ్డి, డైరెక్టర్ శ్రీజా రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి ఓనం వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై కేరళ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ అనుష్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో సాంస్కృతిక అవగాహన పెంపొందుతుందని అన్నారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు కూడా కళాశాలలో సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. డైరెక్టర్ శ్రీజా రెడ్డి మాట్లాడుతూ ఓనం పండుగ ఐక్యత, సోదరభావం, ఆనందానికి ప్రతీక అని అన్నారు. విద్యార్థులు వివిధ సంస్కృతులను గౌరవిస్తూ వాటి గొప్పతనాన్ని తెలుసుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు సంప్రదాయ ఓనపూక్కలం (పూల అలంకరణ), సాంప్రదాయ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాలతో ఓనం వేడుకలను జరుపుకున్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని విద్యార్థులు అభినందించారు.






తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అర్చకుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



- **సదానిరంజన్ సిద్ధాంతి**

**ఎల్కతుర్తి, ఆగస్టు 26 ( తెలంగాణ ముచ్చట్లు):** అర్చకుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన ధ్యేయమని వీరశైవ జంగమ దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానిరంజన్ సిద్ధాంతి అన్నారు. బిచ్కుంద సంస్థానానికి చెందిన శ్రీ శ్రీ శ్రీ ష బ్రా 108 సద్గురు సోమలింగ శివాచార్య మహాస్వామీజీని అర్చక సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు.

ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొంగళ్లమటం రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానిరంజన్ సిద్ధాంతి, రాష్ట్ర కోశాధికారి విభూది ప్రభులింగం తదితరులు మహాస్వామీజీకి సంఘ కార్యకలాపాలు, అర్చకుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ అర్చకుల సమస్యల పరిష్కారంతో పాటు వీరశైవ జంగమ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. అర్చకుల సంక్షేమం, ఆధ్యాత్మిక అభివృద్ధి, సమాజ ఐక్యత కోసం భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు.

మహాస్వామీజీ సంఘ ప్రతినిధులకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించి, ధార్మిక సేవల్లో నిబద్ధతతో కొనసాగాలని సూచించారు. అర్చకులు సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకులుగా సేవలందించాలని, ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని ఆశీర్వదించారు. వీరశైవ జంగమ సమాజ అభివృద్ధి కోసం సంఘం చేపట్టే కార్యక్రమాలకు సంపూర్ణ అనుగ్రహం ఉంటుందని తెలిపారు.

మహాస్వామీజీ ఆశీర్వచనాలతో అర్చకుల సంక్షేమం, వీరశైవ జంగమ సమాజ అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేస్తామని సదానిరంజన్ సిద్ధాంతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి విభూది ప్రభులింగం, గంగాధర్, సతీష్, నాగభూషణం, శివప్రసాద్, బిచ్కుంద సంస్థానానికి చెందిన సభ్యులు, భక్తులు, అర్చక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లు లేక వావిలాల ప్రభుత్వ ఆసుపత్రిలో అవస్థలు



- **వైద్యుల కోసం ఎదురుచూపులు..**
- **నర్సులే వైద్యం చేస్తున్నారంటూ గ్రామస్తుల ఆవేదన**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు లేక సరైన వైద్య సేవలు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నర్సులే రోగులకు వైద్య సేవలు అందిస్తున్న పరిస్థితి నెలకొందని వారు పేర్కొన్నారు. వావిలాల గ్రామం మండల కేంద్రానికి దూరంగా ఉండటంతో అత్యవసర వైద్యం కోసం ప్రజలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాలంటే పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది. దీంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యులు అందుబాటులో ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్యుల కొరత కారణంగా రోగులకు మెరుగైన వైద్యం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చిన్నపాటి అనారోగ్య సమస్యలకు సైతం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వావిలాల ప్రభుత్వ ఆసుపత్రికి శాశ్వత వైద్యులను నియమించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మల్లారెడ్డిపల్లిలో భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి బోనాలు

- **బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లిన మహిళలు**



**వీణవంక, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలోని బుడిగె జంగాల కాలనీ వాసులు బుధవారం పోచమ్మ తల్లి బోనాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించే ఈ సంప్రదాయ వేడుకల్లో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకల్లో భాగంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. డప్పు చప్పుళ్లు, భక్తి నినాదాల మధ్య గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని పోచమ్మ తల్లిని వేడుకున్నట్లు కాలనీవాసులు తెలిపారు. బోనాల వేడుకలతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

# సమృద్ధి వర్షాల కోసం వెంకటేశ్వరస్వామికి భక్తుల ప్రార్థనలు

- **108 కలశాలతో శ్రీ వెంకటేశ్వరస్వామికి విశేష అభిషేకం**



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో 108 కలశాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

ఆలయ ప్రధాన అర్చకులు డింగరి హరికృష్ణ ఆచార్యులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం 108 కలశాలను ఆలయ ప్రాంగణంలో భక్తుల మధ్య ఊరేగించారు. స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి, పాడిపంటలు సమృద్ధిగా పండేలా విస్తారంగా వర్షాలు కురవాలని స్వామివారిని ప్రార్థించినట్లు ప్రధాన అర్చకులు తెలిపారు.

కార్యక్రమంలో శివరామకృష్ణ భజన మండలి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించారు. దీంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.





# జమ్మికుంట కేరళ పాఠశాలలో ఘనంగా ఓణం సంబరాలు

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని స్థానిక కేరళ పాఠశాలలో కేరళ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఓణం పండుగ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

వేడుకలను పాఠశాల చైర్మన్ కేఎస్ బెన్ని జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను పరిచయం చేయడం పాఠశాల ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహన, ఐక్యతా భావం పెంపొందుతాయని పేర్కొన్నారు.

ఓణం పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు కేరళ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.






# విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీకి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ శుభాకాంక్షలు తెలిపారు. జమ్మికుంట పట్టణ పరిధిలో నిర్వహించిన అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. జూపాక శ్రీనివాస చారి అధ్యక్షతన ఏర్పడిన నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎంతో పెద్దదని, ఇంతటి బలమైన సభ్యత్వంతో ఉన్న సంఘాలు అరుదుగా ఉంటాయని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణంలో నివసిస్తున్న ఒక పౌరుడిగా, అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడం, పెన్షన్లు, ఇళ్ల మంజూరు, రోడ్లు తదితర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా తన పరిధిలో పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. అసోసియేషన్‌కు సంబంధించిన ప్రతి విషయంలోనూ తన శక్తిమేరకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమానికి తనను ఆహ్వానించిన అసోసియేషన్ నాయకులు, సభ్యులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు జూపాక శ్రీనివాస చారి, రాజు చారి, సంపత్ చారి, నూతన కమిటీ సభ్యులు, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపురం ఘటనకు న్యాయం చేయాలి.. లేదంటే ఉద్యమం

- **నిందితులను వెంటనే అరెస్టు చేయాలి**
- **మారుపాక అనిల్ కుమార్**

**ఎల్కతుర్తి, ఆగస్టు 26 ( తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం తిమ్మాపురం గ్రామంలో దళితుడైన కొలుగూరి రమేష్‌పై జరిగిన దాడి ఘటనలో బాధితుడికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని చేపడతామని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ హెచ్చరించారు. బుధవారం తిమ్మాపురం గ్రామానికి వెళ్లిన ఆయన బాధితుడు కొలుగూరి రమేష్‌ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి జరిగి ఆరు రోజులు గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయకపోవడం ఆందోళనకరమన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలోని వర్తించే సెక్షన్లను నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు.

ఈ ఘటనలో గ్రామ సర్పంచి పాత్రపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, సర్పంచిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడికి, ఆయన కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించడంతో పాటు ప్రభుత్వం తక్షణ ఆర్థిక, వైద్య సహాయం అందించాలని కోరారు. దళితులపై దాడులు, అవమానాలు, సామాజిక బహిష్కరణ వంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మారుపాక అనిల్ కుమార్ స్పష్టం చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు డీహెచ్‌పీఎస్ అండగా నిలుస్తుందని, అధికారులు వెంటనే స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, రాష్ట్ర సమితి సభ్యులు రొంటాల దేవా, మచ్చ శ్రీనివాస్, శెనిగరపు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మేఘారెడ్డిని విమర్శించే నైతిక హక్కు మీకుందా?




- **కృష్ణానాయక్‌ను నిలదీసిన కాంగ్రెస్ నేతలు**

**వనపర్తి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేను విమర్శించే ముందు కృష్ణానాయక్ తన గత చరిత్రను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాల్యా నాయక్, వనపర్తి మండల అధ్యక్షుడు రవి నాయక్, అంకాయపల్లి సర్పంచ్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధికి ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనపై తప్పుడు ఆరోపణలు చేస్తే రాజకీయంగా దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. కృష్ణానాయక్ గతంలో నిర్వహించిన ప్రజాప్రతినిధి బాధ్యతలు, అభివృద్ధి పనులపై ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో సర్పంచ్‌ల పేరుతో రూ.60 లక్షలు కాజేశారనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలని కోరారు. గిరిజనుల కోసం కేటాయించిన ఎస్టీ నిధుల వినియోగంపై కూడా బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు లెక్క చెప్పాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి ఎమ్మెల్యే మేఘారెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకనే ప్రజలు గత ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని అన్నారు. ఇకపై ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే ప్రతి ఆరోపణకు దీటుగా సమాధానం ఇస్తామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో చిగురుచెట్టు తండా మాజీ సర్పంచ్ రాధాకృష్ణ నాయక్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భారత్–జపాన్ ఆర్థిక భాగస్వామ్యానికి ఊతం



- **టోక్యోలో జేబీఐసీ ప్రతినిధులతో పీయూష్ గోయల్ భేటీ**
- **పెట్టుబడులు, ఆర్థిక సహకారంపై చర్చలు**
- **ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల బలోపేతానికి చర్యలు**
- **కొత్త అవకాశాల అన్వేషణపై దృష్టి**

**టోక్యో, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** భారత్-జపాన్ ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జపాన్ పర్యటనలో ఉన్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ టోక్యోలో జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జేబీఐసీ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తదాశి మయెడాతో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, పెట్టుబడి భాగస్వామ్యాన్ని విస్తరించే అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో భారత్‌లో పెట్టుబడుల అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక రంగ సహకారం, దీర్ఘకాలిక ఆర్థిక భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో జపాన్ పెట్టుబడులను మరింత ప్రోత్సహించే అంశాలను పరిశీలించారు.

భారత్, జపాన్ దేశాల మధ్య ఇప్పటికే ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఆర్థిక రంగంలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఇరు పక్షాలు ప్రస్తావించాయి. పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, తయారీ రంగాల్లో సహకారం పెరగడం ద్వారా ఇరు దేశాలకు పరస్పర ప్రయోజనాలు కలుగుతాయని అభిప్రాయపడ్డారు. జపాన్ ఆర్థిక సంస్థల నుంచి భారత్‌కు మరింత పెట్టుబడులు ఆకర్షించేందుకు ఉన్న అవకాశాలను కూడా సమావేశంలో చర్చించారు. మౌలిక వసతులు, పరిశ్రమలు, శక్తి రంగం, ఆధునిక సాంకేతికతలకు సంబంధించిన ప్రాజెక్టుల్లో భాగస్వామ్యాన్ని విస్తరించడంపై దృష్టి సారించారు.

భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో జపాన్ కీలక భాగస్వామిగా కొనసాగుతోందని పీయూష్ గోయల్ పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఆర్థిక సహకారం భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులకు దారితీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశం ద్వారా భారత్-జపాన్ ఆర్థిక భాగస్వామ్యానికి మరింత బలం చేకూరనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెట్టుబడులు, ఆర్థిక సహకారం, పారిశ్రామిక అభివృద్ధి రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.

# చెమ్‌కనెక్ట్–2026కు ఘన ప్రారంభం

- **ఐఐటీ మద్రాస్‌లో తొలి సంచిక నిర్వహణ**
- **రసాయన, పెట్రోరసాయన రంగాలపై దృష్టి**
- **200 మందికిపైగా నిపుణుల భాగస్వామ్యం**
- **పరిశోధన, ఆవిష్కరణలకు వేదికగా కార్యక్రమం**



**చెన్నై, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖకు చెందిన రసాయనాలు మరియు పెట్రోరసాయనాల విభాగం ఆధ్వర్యంలో చెమ్‌కనెక్ట్-2026 తొలి సంచికను ఆగస్టు 25న భారతీయ సాంకేతిక విద్యా సంస్థ మద్రాస్‌లో ఘనంగా ప్రారంభించారు. రసాయన, పెట్రోరసాయన రంగాల్లో ఆవిష్కరణలు, పరిశోధన, పరిశ్రమల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, విద్యాసంస్థలు, నవతర సంస్థలు, పరిశోధనా సంస్థలకు చెందిన 200 మందికిపైగా ప్రముఖులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. రసాయన రంగ అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఫలితాలు, భవిష్యత్ అవకాశాలపై చర్చలు జరిపారు.

రసాయనాలు మరియు పెట్రోరసాయనాల విభాగం ఏర్పాటు చేసిన ప్రతిభా కేంద్రాల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడం, కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించడం వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. దేశంలో రసాయన పరిశ్రమను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ స్థాయిలో పోటీతత్వాన్ని పెంచే దిశగా కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం పెరగడం ద్వారా కొత్త అవకాశాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు.

నవతర సంస్థలు తమ వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించగా, పరిశ్రమల ప్రతినిధులు వాటి వాణిజ్య అవకాశాలపై చర్చించారు. పరిశోధన నుంచి ఉత్పత్తి వరకు ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నిపుణులు ప్రస్తావించారు. చెమ్‌కనెక్ట్-2026 కార్యక్రమం రసాయన, పెట్రోరసాయన రంగాల్లో జ్ఞాన మార్పిడి, భాగస్వామ్య అవకాశాలు, సాంకేతిక పురోగతికి కీలక వేదికగా నిలిచిందని అధికారులు తెలిపారు. దేశ పరిశ్రమల అభివృద్ధి, పరిశోధనల విస్తరణకు ఈ కార్యక్రమం కొత్త దిశను చూపుతుందని అభిప్రాయపడ్డారు.

# జాతీయ భద్రతకు సమగ్ర వ్యూహాల అవసరం

- **జాతీయ భద్రతా వ్యూహాల**
- **సదస్సులో అమిత్ షా ప్రసంగం**
- **ఉగ్రవాదం, సైబర్ ముప్పులపై అప్రమత్తతకు పిలుపు**
- **'ప్రహార్' వ్యూహాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచన**
- **మాదకద్రవ్యాలు, చొరబాట్ల రహిత భారత్ లక్ష్యం**




**న్యూఢిల్లీ, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర హోంమంత్రి అమిత్ షా జాతీయ భద్రతా వ్యూహాల 9వ సదస్సు ముగింపు సమావేశంలో పాల్గొని దేశ భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొంటున్న అస్థిరత, ఇంధన భద్రత సవాళ్లు, సరఫరా వ్యవస్థల అంతరాయాలు, మతోన్మాదం, సైబర్ తప్పుడు ప్రచారాలను దృష్టిలో ఉంచుకుని భారత విదేశాంగ విధానాలు రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ భద్రతకు ముప్పుగా మారే ప్రమాదాలను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా ఎదుర్కోవాలని అమిత్ షా సూచించారు. చొరబాటుదారులు, ఉగ్రవాద కార్యకలాపాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి సవాళ్లను నిర్మూలించేందుకు కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

'ప్రహార్' పేరుతో రూపొందించిన ఉగ్రవాద వ్యతిరేక వ్యూహాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ రోజువారీ భద్రతా వ్యవస్థల్లో భాగంగా మార్చుకోవాలని హోంమంత్రి సూచించారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో ముందస్తు సమాచార సేకరణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమన్వయ చర్యలు కీలకమని వివరించారు. సైబర్ వేదికల ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారం, మతోన్మాద ప్రచారం దేశ భద్రతకు సవాలుగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ముప్పులను ఎదుర్కొనేందుకు భద్రతా సంస్థలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు.

ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో దేశ భద్రతా వ్యూహాలను కూడా కాలానుగుణంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అమిత్ షా అభిప్రాయపడ్డారు. ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థల స్థిరత్వం, అంతర్జాతీయ భాగస్వామ్యాల బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వికసిత భారత లక్ష్య సాధనలో జాతీయ భద్రత కీలక పాత్ర పోషిస్తుందని హోంమంత్రి పేర్కొన్నారు. భద్రత, స్థిరత్వం, సమర్థ పరిపాలన ద్వారా దేశ అభివృద్ధికి బలమైన పునాది వేయవచ్చని ఆయన తెలిపారు. సదస్సులో పాల్గొన్న భద్రతా సంస్థల ప్రతినిధులు, నిపుణులు దేశ భద్రతా సవాళ్లు, పరిష్కారాలపై విస్తృతంగా చర్చించారు.

# ప్రగతి సమావేశంలో కీలక ప్రాజెక్టుల సమీక్ష

- **53వ ప్రగతి సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత**
- **రూ.30 వేల కోట్లకు పైగా ప్రాజెక్టుల పరిశీలన**
- **మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**
- **వ్యవసాయం, సైబర్ భద్రతపై కీలక సూచనలు**




**న్యూఢిల్లీ, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 53వ ప్రగతి సమావేశానికి అధ్యక్షత వహించి దేశంలోని కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. రైల్వే, రహదారులు, విద్యుత్ రంగాలకు సంబంధించిన ఆరు ప్రధాన ప్రాజెక్టుల అమలుపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ ప్రాజెక్టులు తొమ్మిది రాష్ట్రాల్లో విస్తరించి ఉండగా, వాటి మొత్తం పెట్టుబడి విలువ రూ.30 వేల కోట్లకు మించి ఉందని అధికారులు వెల్లడించారు. మౌలిక వసతుల ప్రాజెక్టులను విడివిడిగా కాకుండా సమగ్ర దృష్టితో చూడాలని ప్రధాని సూచించారు. ఒక ప్రాజెక్టులోని ప్రతి భాగం పరస్పరం అనుసంధానమై ఉంటుందని, అందువల్ల మొత్తం ప్రాజెక్టు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని అమలు జరగాలని పేర్కొన్నారు. పనుల వేగం, నాణ్యత, సమన్వయంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు.

ప్రాజెక్టుల అమలులో ప్రతి దశలో సంస్కరణలు కొనసాగాలని, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు చురుకైన పని విధానాన్ని అవలంబించాలని ప్రధాని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే గుర్తించి పరిష్కరించే విధానాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని సమీక్షించిన సందర్భంగా వ్యవసాయ సమాచారాన్ని మరింత సమర్థంగా వినియోగించేందుకు కృత్రిమ మేధస్సు సహా అత్యాధునిక డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించాలని ప్రధాని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు, సమాచార ఆధారిత నిర్ణయాలు అందించేందుకు సాంకేతికత కీలకమని పేర్కొన్నారు.

సైబర్ మోసాలు, 'డిజిటల్ అరెస్టు' పేరుతో జరుగుతున్న మోసాల అంశంపై కూడా ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన పెంపు, సైబర్ భద్రతపై విద్య, అధికారులకు శిక్షణ, సంబంధిత సంస్థల మధ్య సమన్వయం ద్వారా ఇటువంటి మోసాలను అరికట్టాలని సూచించారు. డిజిటల్ ప్రపంచంలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. దేశ అభివృద్ధిలో మౌలిక వసతుల రంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రవాణా, విద్యుత్, డిజిటల్ రంగాల అభివృద్ధి ద్వారా ఆర్థిక వృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. ప్రగతి సమావేశం ద్వారా ప్రాజెక్టుల అమలులో ఉన్న అడ్డంకులను తొలగించి వేగవంతమైన అభివృద్ధి సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# జాతీయ సామర్థ్య నిర్మాణానికి సమిష్టి కృషి అవసరం

- **నైపుణ్యాలతో పాటు మానసిక సామర్థ్యాల పెంపుపై దృష్టి**
- **వేగంగా మారుతున్న సవాళ్లకు సమాజం సిద్ధం కావాలి**
- **ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం కలిసి పనిచేయాలి**
- **పరిశోధనలకు దాతృత్వ సంస్కృతి అవసరమని జితేంద్ర సింగ్ సూచన**

**న్యూఢిల్లీ, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ స్థాయిలో భారత్ తన ప్రాధాన్యతను కొనసాగించాలంటే నైపుణ్యాల అభివృద్ధితో పాటు మానసిక సామర్థ్యాల పెంపుపై కూడా సమానంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. సామర్థ్య నిర్మాణంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిణామాలు, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సామర్థ్య నిర్మాణం కేవలం వ్యక్తిగత స్థాయిలో కాకుండా సమాజం మొత్తం భాగస్వామ్యంతో సాగాలని మంత్రి అన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, విద్యా సంస్థలు, సామాజిక సంస్థలు కలిసి పనిచేసే సమగ్ర విధానం అవసరమని సూచించారు.

దేశాభివృద్ధికి మానవ వనరుల సామర్థ్య పెంపు కీలకమని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. యువతలో సృజనాత్మకత, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా శిక్షణా విధానాలు మారాల్సిన అవసరం ఉందని వివరించారు. పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో భారత్ మరింత ముందుకు వెళ్లాలంటే దాతృత్వ సంస్కృతిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలకు సమాజం నుంచి మరింత మద్దతు లభించే వాతావరణం ఏర్పడాలని సూచించారు.

ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ప్రైవేట్ రంగం భాగస్వామ్యం కూడా దేశ సామర్థ్య నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాల మధ్య సమన్వయం పెరిగితే ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. భారత్‌ను జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి అవసరమని జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. పరిశోధన, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భాగస్వామ్యంతో దేశాన్ని మరింత బలమైన స్థాయికి తీసుకెళ్లవచ్చని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# గర్భంతోనూ హెవీ వర్కౌట్స్.. సమంత కీలక సూచనలు!

**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** గర్భధారణ సమయంలో సాధారణంగా మహిళలు శారీరక శ్రమ విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే కొందరు వైద్యుల సూచనల మేరకు తేలికపాటి వ్యాయామాలు, యోగాసనాలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో నటి సమంత గర్భధారణ సమయంలోనూ స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేస్తూ బరువులు ఎత్తుతున్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం ప్రస్తుతం వైరల్‌గా మారింది.

తాను గర్భంతో ఉన్నప్పటికీ వర్కౌట్స్ చేయడానికి ముందు వైద్యుల అనుమతి తీసుకున్నానని సమంత వెల్లడించింది. అంతేకాకుండా తన ట్రైనర్ ప్రినేటల్ ట్రైనింగ్‌లో సర్టిఫైడ్ అని, ఆయన పర్యవేక్షణలోనే తన శరీరానికి, గర్భధారణకు అనుగుణంగా వ్యాయామాల్లో అవసరమైన మార్పులు చేసుకుంటున్నట్లు తెలిపింది.

తన వర్కౌట్స్‌ను చూసి ఇతర గర్భిణులు వాటిని అనుసరించవద్దని సమంత స్పష్టం చేసింది. "ప్రతి గర్భధారణ భిన్నంగా ఉంటుంది. గర్భధారణ సమయంలో వ్యాయామం చేసే ముందు మీ వైద్యుడిని సంప్రదించండి. అర్హత కలిగిన ట్రైనర్ సహాయంతోనే శిక్షణ తీసుకోండి" అంటూ సూచించింది. సమంత షేర్ చేసిన ఫొటోలు, ఆమె ఇచ్చిన సూచనలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా ఆమె డెడికేషన్‌ను పలువురు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సమంత.. ప్రస్తుతం నిర్మాతగానూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఇటీవల దర్శకుడు రాజ్ నిడిమోరును వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించినట్లు సమాచారం.



# ప్రభాస్‌తో కాఫీ డేట్‌కు వెళ్లాలనుంది.. దివి ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** బిగ్‌బాస్ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి దివి.. తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. కెరీర్ ప్రారంభంలో చిన్న చిన్న పాత్రలు చేసిన ఆమె.. మహేష్‌బాబు నటించిన 'మహర్షి'తో పాటు పలు చిత్రాల్లో కనిపించింది. అనంతరం బిగ్‌బాస్ షోలో పాల్గొని మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. బిగ్‌బాస్ సమయంలో మెగాస్టార్ చిరంజీవి ఇచ్చిన మాట మేరకు 'గాడ్‌ఫాదర్' చిత్రంలో కీలక పాత్రలో నటించే అవకాశం కూడా దక్కించుకుంది. ప్రస్తుతం సినిమాలతో పాటు ప్రైవేట్ ఆల్బమ్స్‌లోనూ కనిపిస్తున్న దివి.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటోంది. ఈ క్రమంలో గతంలో ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్‌పై తనకున్న అభిమానాన్ని ఆమె వెల్లడించిన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

దివి మాట్లాడుతూ.. 'మిర్చి' సినిమా చూసినప్పటి నుంచి ప్రభాస్‌కు తాను వీరాభిమానిగా మారానని తెలిపింది. ఆ తర్వాత 'బాహుబలి' సినిమాలతో ఆయనపై తన అభిమానం మరింత పెరిగిందని చెప్పింది. ప్రభాస్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ కూడా పంపినట్లు గుర్తుచేసుకుంది.

చాలా మంది అభిమానుల్లాగే తనకూ ఒక్కసారి ప్రభాస్‌ను కలవాలని, ఆయనతో మాట్లాడాలని ఉందని దివి చెప్పుకొచ్చింది. ముఖ్యంగా ప్రభాస్‌తో ఓ కూల్ కాఫీ డేట్‌కు వెళ్లి మనసువిప్పి మాట్లాడాలని తన కోరిక అని తెలిపింది. ప్రభాస్ ఇంటికి వచ్చే అతిథులను ఎంతో ఆప్యాయంగా చూసుకుంటారని, ఆయన ఆతిథ్యం అద్భుతంగా ఉంటుందని విన్నానని పేర్కొంది. తన డ్రీమ్ డేట్ ఓ కాఫీతో మొదలై, ప్రభాస్‌తో సరదాగా మాట్లాడుకుంటూ సాగాలని ఉందని దివి తన మనసులో మాట బయటపెట్టింది.

# దర్శకుడికి ఇన్‌స్టాలో మెసేజ్.. అలా 'సప్త సాగరాలు దాటి'లో ఛాన్స్!

**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** అందాల భామ రుక్మిణి వసంత్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో దూసుకుపోతోంది. 'సప్త సాగరాలు దాటి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ అమ్మడు.. తాజాగా యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరోవైపు ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' చిత్రంలోనూ ఆమె కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. దీంతో రుక్మిణి వసంత్ కెరీర్ జోరుగా సాగుతోంది.

తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రుక్మిణి తన సినీ కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ముఖ్యంగా తనకు మంచి గుర్తింపు తీసుకొచ్చిన 'సప్త సాగరాలు దాటి' సినిమాలో అవకాశం ఎలా వచ్చిందో ఆమె వివరించింది.

'సప్త సాగరాలు దాటి' సినిమాలో రిషబ్ శెట్టి సరసన నటించిన రుక్మిణి.. ప్రియా అలియాస్ పుట్టి పాత్రలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. హేమంత్ రావు దర్శకత్వం వహించిన ఈ సినిమా తన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది.

ఈ సినిమా కోసం హీరోయిన్ ఎంపిక జరుగుతోందని తెలుసుకున్న రుక్మిణి.. ఎలాంటి సిఫార్సులు లేకుండా నేరుగా దర్శకుడిని సంప్రదించాలని నిర్ణయించుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో హేమంత్ రావుకు మెసేజ్ చేసి, సినిమాలో నటించేందుకు తాను ఆసక్తిగా ఉన్నట్లు తెలిపింది. సోషల్ మీడియాలోనే కాకుండా ఈమెయిల్ ద్వారా కూడా తన ఆసక్తిని తెలియజేసినట్లు చెప్పింది.

అలా మెసేజ్ చేసిన దాదాపు పది రోజుల తర్వాత దర్శకుడు హేమంత్ రావు తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో తిరిగి మెసేజ్ చేశారని రుక్మిణి వెల్లడించింది. అనంతరం జరిగిన ఎంపిక ప్రక్రియలో ఆమెకు 'సప్త సాగరాలు దాటి'లో అవకాశం దక్కింది.

రుక్మిణి వసంత్‌కు ఇది రెండో సినిమా అయినప్పటికీ.. ఈ చిత్రంతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత వరుస అవకాశాలు రావడంతో వెనక్కి తిరిగి చూసుకోకుండా దూసుకుపోతోంది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న పలు భారీ చిత్రాల్లో భాగమవుతూ నేషనల్ క్రష్‌గా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.





# జల వనరుల సంరక్షణకు పిలుపు

- సరస్సులు జీవ వైవిధ్యానికి నిలయాలు
- నీటి భద్రతలో కీలక పాత్ర
- భవిష్యత్ తరాలకు అమూల్య సంపద

**డెస్క్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా తాగునీటి అవసరాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సరస్సులు, చెరువులు, జలాశయాల ప్రాధాన్యం మరింతగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 27న ప్రపంచ సరస్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తూ జల వనరుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. సరస్సులు కేవలం నీటి నిల్వ కేంద్రాలుగానే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడే కీలక వ్యవస్థలుగా నిలుస్తున్నాయి. మానవ జీవనానికి, వ్యవసాయానికి, పశు సంపదకు, పరిశ్రమలకు అవసరమైన నీటి అవసరాలను తీర్చడంలో ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ కారణంగా అనేక సరస్సులు కనుమరుగవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణ అత్యవసరంగా మారింది.

సరస్సులు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద. వర్షపు నీటిని నిల్వ ఉంచడం ద్వారా భూగర్భ జలాలను పునరుద్ధరించడంలో ఇవి కీలకంగా వ్యవహరిస్తాయి. సరస్సుల చుట్టూ ఏర్పడే సహజ పర్యావరణ వ్యవస్థ అనేక జీవజాతులకు ఆశ్రయం కల్పిస్తుంది. చేపలు, పక్షులు, జలచరాలు, వివిధ రకాల మొక్కలు సరస్సులపై ఆధారపడి జీవిస్తాయి. అందువల్ల సరస్సుల పరిరక్షణ అంటే కేవలం నీటి వనరుల సంరక్షణ మాత్రమే కాదు, జీవ వైవిధ్యాన్ని కాపాడటం కూడా. సరస్సులు పర్యాటక రంగ అభివృద్ధికి కూడా తోడ్పడుతూ స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. భారతదేశంలో వేలాది చెరువులు, సరస్సులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయి. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో సాగునీటి అవసరాలను తీర్చడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చెరువుల ఆధారంగా సాగు విస్తృతంగా కొనసాగుతోంది. అయితే ఇటీవల కాలంలో ఆక్రమణలు, కాలుష్యం, మురుగు నీటి ప్రవాహం, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా అనేక సరస్సులు తమ ఉనికిని కోల్పోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సరస్సుల విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవడం పర్యావరణవేత్తలను ఆందోళనకు గురి చేస్తోంది.

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో కూడా సరస్సుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. వరదల సమయంలో అదనపు నీటిని నిల్వ ఉంచడం ద్వారా వరద ముప్పును తగ్గిస్తాయి. ఎండాకాలంలో నీటి లభ్యతను కొనసాగించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా స్థానిక వాతావరణాన్ని సమతుల్యం చేయడంలో, ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కూడా సరస్సులు దోహదపడతాయి. పట్టణ ప్రాంతాల్లో సరస్సుల ఉనికి పర్యావరణ నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించడంలో ఉపయోగపడుతోంది. సరస్సుల సంరక్షణ కోసం ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆక్రమణలను అరికట్టడం, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడం, సరస్సుల పునరుద్ధరణ కార్యక్రమాలను వేగవంతం చేయడం అత్యంత అవసరం. వర్షపు నీటి సంరక్షణ, చెత్త నిర్వహణ, పర్యావరణహిత జీవనశైలిని ప్రోత్సహించడం ద్వారా సరస్సులను కాపాడుకోవచ్చు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో జల వనరుల సంరక్షణ పట్ల బాధ్యత పెంపొందించవచ్చు.

ప్రపంచ సరస్సుల దినోత్సవం సందర్భంగా ప్రతి వ్యక్తి నీటి వనరుల పరిరక్షణకు తన వంతు బాధ్యతను గుర్తించాలి. సరస్సులు, చెరువులు నేటి అవసరాలకే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా జీవనాధారంగా నిలుస్తాయి. వాటిని కాపాడటం అంటే మన పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని, ఆర్థికాభివృద్ధిని, మానవ జీవితాన్ని కాపాడటమే. జల వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే సరస్సులు తమ సహజ వైభవాన్ని నిలుపుకుంటూ రాబోయే తరాలకు అమూల్య సంపదగా మిగులుతాయి.

# ఫాస్ట్ ఫుడ్ ప్రపంచానికి ప్రత్యేక వేడుక



- రుచులతో ఆకట్టుకునే బర్గర్ సంస్కృతి
- ప్రపంచవ్యాప్తంగా ఆహార ప్రియుల సంబరం
- ఆరోగ్యం, రుచుల మధ్య సమతుల్యత అవసరం

**డెస్క్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ఆహార ప్రియులు ఆసక్తిగా ఎదురుచూసే ప్రత్యేక దినాల్లో నేషనల్ బర్గర్ డే ఒకటి. ప్రతి సంవత్సరం ఆగస్టు 28న జరుపుకునే ఈ రోజు బర్గర్ అనే ప్రసిద్ధ ఆహార పదార్థం చుట్టూ ఏర్పడిన ప్రపంచవ్యాప్త ఆహార సంస్కృతిని గుర్తు చేస్తుంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన ఫాస్ట్ ఫుడ్‌గా బర్గర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. రుచి, సౌలభ్యం, వైవిధ్యం కారణంగా బర్గర్ ప్రపంచ ఆహార మార్కెట్‌లో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది. బర్గర్ చరిత్రను పరిశీలిస్తే జర్మనీలోని హాంబర్గ్ నగరంతో దీని మూలాలు ముడిపడి ఉన్నట్లు తెలుస్తుంది. కాలక్రమేణా అమెరికాలో ఇది విస్తృత ప్రజాదరణ పొందింది. అక్కడి నుంచి ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి అనేక రకాల రూపాల్లో అభివృద్ధి చెందింది. ప్రస్తుతం చికెన్, వెజిటేబుల్, చేపలు, పన్నీర్, మొక్కల ఆధారిత పదార్థాలతో తయారయ్యే అనేక రకాల బర్గర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ప్రాంతం తన సొంత రుచులకు అనుగుణంగా బర్గర్‌లో మార్పులు తీసుకువచ్చింది.

నేటి ఆధునిక జీవనశైలిలో బర్గర్ వేగవంతమైన ఆహారంగా గుర్తింపు పొందింది. ఉద్యోగాలు, విద్య, నగర జీవన ఒత్తిళ్ల మధ్య తక్కువ సమయంలో లభించే ఆహారంగా దీని వినియోగం పెరిగింది. ఆహార పరిశ్రమలో బర్గర్ ఒక పెద్ద వ్యాపార రంగంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా వేలాది రెస్టారెంట్లు, ఆహార శ్రేణులు బర్గర్ విక్రయాలపై ఆధారపడి కోట్లాది రూపాయల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయి. దీనివల్ల ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరిగాయి. అయితే బర్గర్ వినియోగంపై ఆరోగ్య నిపుణులు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు. అధిక కొవ్వు, ఉప్పు, కేలరీలు కలిగిన బర్గర్లను తరచుగా తీసుకోవడం వల్ల ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు మరియు యువత ఫాస్ట్ ఫుడ్‌పై అధికంగా ఆధారపడకుండా సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం అవసరమని నిపుణులు చెబుతున్నారు.

ఇటీవలి కాలంలో ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహనతో బర్గర్ తయారీలో కూడా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తక్కువ కొవ్వు పదార్థాలు, తాజా కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలతో తయారయ్యే బర్గర్లు ప్రాచుర్యం పొందుతున్నాయి. మొక్కల ఆధారిత ఆహారాలకు పెరుగుతున్న ఆదరణ కారణంగా శాఖాహార బర్గర్లకు కూడా డిమాండ్ పెరుగుతోంది. దీంతో రుచి, ఆరోగ్యం రెండింటినీ సమన్వయం చేసే ప్రయత్నాలు ఆహార రంగంలో కనిపిస్తున్నాయి. నేషనల్ బర్గర్ డే కేవలం ఒక ఆహార పదార్థాన్ని ఆస్వాదించే రోజు మాత్రమే కాదు. ప్రపంచ ఆహార సంస్కృతిలో వచ్చిన మార్పులను, వినియోగదారుల అభిరుచులను, ఆహార పరిశ్రమ అభివృద్ధిని గుర్తు చేసే సందర్భంగా కూడా ఈ దినోత్సవం నిలుస్తోంది. రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదిస్తూనే ఆరోగ్యకరమైన ఎంపికలను చేసుకోవాలనే సందేశాన్ని ఈ రోజు అందిస్తోంది. రుచి మరియు ఆరోగ్యం మధ్య సమతుల్యత పాటించినప్పుడే ఆహార ఆనందం సంపూర్ణమవుతుంది.

# కారణం లేకుండానే ఆనందం పంచే వేడుక

- చిన్న సంతోషాల గొప్పతనాన్ని చాటే రోజు
- మానవ సంబంధాలకు కొత్త ఊపిరి
- ప్రేమ, కృతజ్ఞతలకు ప్రత్యేక వేదిక



**డెస్క్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** జీవితంలో ప్రతి పనికి, ప్రతి నిర్ణయానికి, ప్రతి వేడుకకు ఒక కారణం ఉండాలనే భావన మనలో బలంగా నాటుకుపోయింది. అయితే ఎలాంటి ప్రత్యేక కారణం లేకుండానే సంతోషాన్ని పంచుకోవడం, మనసుకు నచ్చిన పనిని చేయడం, ఇష్టమైన వారిని ఆనందపరచడం కూడా జీవితంలో అంతే ముఖ్యమని గుర్తు చేసే ప్రత్యేక దినమే నేషనల్ జస్ట్ బికాజ్ డే. ప్రతి సంవత్సరం ఆగస్టు 27న జరుపుకునే ఈ రోజు మానవ సంబంధాల విలువను, చిన్న చిన్న ఆనందాల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెబుతుంది. మనం ఎప్పుడూ ఒక సందర్భం కోసం ఎదురు చూడకుండా ప్రేమను, అభిమానాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేయవచ్చనే సందేశాన్ని ఈ దినోత్సవం అందిస్తుంది. నేటి వేగవంతమైన ప్రపంచంలో మనుషులు సమయంతో పోటీ పడుతూ జీవిస్తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్య, కుటుంబ బాధ్యతల మధ్య అనేక మంది తమ భావోద్వేగాలను వ్యక్తం చేయడానికి కూడా సమయం కేటాయించలేకపోతున్నారు. అలాంటి పరిస్థితుల్లో నేషనల్ జస్ట్ బికాజ్ డే ఒక చిన్న విరామంలా పనిచేస్తుంది. మన జీవితంలో ఉన్న వ్యక్తుల విలువను గుర్తు చేస్తూ వారిని సంతోషపెట్టేందుకు ఎలాంటి పెద్ద కారణం అవసరం లేదని తెలియజేస్తుంది. ఒక చిరునవ్వు, ఒక మంచి మాట, ఒక అనుకోని సందేశం కూడా ఎవరి రోజునైనా ప్రత్యేకంగా మార్చగలదు. ఈ దినోత్సవం వెనుక ఉన్న ప్రధాన భావన నిరాడంబరమైన ఆనందాన్ని ప్రోత్సహించడం. సమాజంలో చాలా సందర్భాల్లో బహుమతులు, శుభాకాంక్షలు, ఆతిథ్యాలు అన్నీ ప్రత్యేక రోజులకు మాత్రమే పరిమితమైపోతున్నాయి. కానీ ఎలాంటి కారణం లేకుండానే ఒక స్నేహితుడికి పుస్తకం బహుమతిగా ఇవ్వడం, తల్లిదండ్రులతో కొంత సమయం గడపడం, జీవిత భాగస్వామికి ఇష్టమైన వస్తువు అందించడం వంటి చిన్న చర్యలు కూడా అపారమైన సంతోషాన్ని కలిగిస్తాయి. ఇలాంటి చర్యలే మానవ సంబంధాలను మరింత బలపరుస్తాయి.

మానసిక ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇతరులను సంతోషపెట్టడం ద్వారా మనలో కూడా సానుకూల భావనలు పెరుగుతాయి. ప్రేమ, దయ, కృతజ్ఞత వంటి భావోద్వేగాలు ఒత్తిడిని తగ్గించి మనసుకు ప్రశాంతతను కలిగిస్తాయి. ఒక వ్యక్తికి చూపిన చిన్న ఆప్యాయత అతనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా జీవితంపై సానుకూల దృక్పథాన్ని కూడా కలిగించగలదు. అందువల్ల నేషనల్ జస్ట్ బికాజ్ డే కేవలం ఒక సరదా వేడుక మాత్రమే కాకుండా మానసిక శ్రేయస్సును పెంపొందించే ఒక సామాజిక ఉద్యమంలా కూడా చెప్పవచ్చు. కుటుంబ వ్యవస్థలో కూడా ఈ దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నేటి కాలంలో కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ పరస్పరం మాట్లాడుకునే సమయం తగ్గిపోతోంది. ప్రతి ఒక్కరూ తమ తమ పనుల్లో నిమగ్నమైపోతున్నారు. అలాంటి సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, పాత జ్ఞాపకాలను పంచుకోవడం, వారికి కృతజ్ఞతలు తెలియజేయడం వంటి చిన్న చర్యలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయి. ఈ రోజు ఆ దిశగా ఒక మంచి అవకాశాన్ని కల్పిస్తుంది.

స్నేహబంధాల పరంగా కూడా ఈ దినోత్సవం ఎంతో విలువైనది. జీవిత ప్రయాణంలో అనేక మంది స్నేహితులు మనకు తోడుగా నిలుస్తారు. అయితే కాలక్రమేణా బిజీ జీవితాల కారణంగా వారితో సంబంధాలు తగ్గిపోతాయి. అలాంటి స్నేహితుడికి ఒక ఫోన్ కాల్ చేయడం, ఒక సందేశం పంపించడం లేదా అనుకోకుండా కలవడం ద్వారా పాత అనుబంధాలను మళ్లీ బలపరచవచ్చు. నేషనల్ జస్ట్ బికాజ్ డే అలాంటి మధుర క్షణాలను సృష్టించడానికి ప్రేరణగా నిలుస్తుంది. సామాజిక దృక్పథంలో చూస్తే ఈ రోజు దయ, సహానుభూతి, మానవత్వం వంటి విలువలను ప్రోత్సహిస్తుంది. అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం, వృద్ధాశ్రమాలు లేదా అనాథాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం, పేదలకు ఆహారం అందించడం వంటి కార్యక్రమాలు కూడా ఈ దినోత్సవాన్ని అర్థవంతంగా మార్చగలవు. సమాజంలో ప్రేమ, కరుణ, పరస్పర సహకారం పెరిగినప్పుడే ఆరోగ్యకరమైన సామాజిక వాతావరణం ఏర్పడుతుంది. డిజిటల్ యుగంలో మానవ సంబంధాలు ఎక్కువగా సామాజిక మాధ్యమాలకే పరిమితమవుతున్నాయి. శుభాకాంక్షలు, అభినందనలు, పరామర్శలు అన్నీ సందేశాల రూపంలోనే జరిగిపోతున్నాయి. అయితే వ్యక్తిగతంగా కలుసుకోవడం, ఆప్యాయంగా మాట్లాడడం, సమయం కేటాయించడం వంటి అంశాలకు ఇప్పటికీ ప్రత్యేకమైన విలువ ఉంది. నేషనల్ జస్ట్ బికాజ్ డే మనకు ఈ విషయాన్ని మరోసారి గుర్తు చేస్తుంది. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మానవ సంబంధాల స్థానాన్ని అది భర్తీ చేయలేదని తెలియజేస్తుంది.

ఈ దినోత్సవం యువతకు కూడా ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. విజయం, సంపాదన, పోటీ వంటి అంశాల వెనుక పరుగులు తీస్తూ జీవితంలోని చిన్న చిన్న ఆనందాలను కోల్పోవద్దని సూచిస్తుంది. స్నేహితులతో నవ్వుకోవడం, కుటుంబంతో గడపడం, ఇష్టమైన పనులు చేయడం వంటి క్షణాలే జీవితాన్ని సంపూర్ణంగా మారుస్తాయి. ఎలాంటి ప్రత్యేక సందర్భం లేకుండానే ఆనందాన్ని సృష్టించుకోవడం కూడా ఒక కళ అని ఈ రోజు చెబుతుంది. నేషనల్ జస్ట్ బికాజ్ డే చివరికి మనందరికీ ఒక సాధారణ కానీ గొప్ప సందేశాన్ని అందిస్తుంది. ప్రేమను వ్యక్తం చేయడానికి, కృతజ్ఞతను తెలియజేయడానికి, ఇతరులను సంతోషపెట్టడానికి ఎప్పుడూ పెద్ద కారణాలు అవసరం ఉండవు. ఒక మంచి మాట, ఒక చిన్న సహాయం, ఒక ఆప్యాయమైన పలకరింపు కూడా జీవితాలను మార్చగలదు. కారణం లేకుండానే చేసే మంచి పనులు మానవ సంబంధాలను మరింత బలపరుస్తూ సమాజాన్ని సానుకూల దిశగా నడిపిస్తాయి. అందుకే ఈ దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, మానవత్వాన్ని గుర్తు చేసే విలువైన సందేశంగా నిలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






## సేవనే జీవిత మార్గంగా..

పూజారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వివిధ ప్రాంతాల్లో ఆయన అందించిన సేవలు.. ఆయనలోని నాయకత్వ లక్షణాలను మరింతగా వెలికి తీశాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో మమేకమవుతూ, యువతతో అనుబంధాన్ని పెంచుకుంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.2009లో వరంగల్ డయాసిస్ డయోసిసన్ యూత్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి యువతలో ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు కృషి చేశారు. ఆయన సేవా ప్రస్థానానికి గుర్తింపుగా 2013 జూన్ 13న ఏలూరు డయాసిస్ బిషప్‌గా నియమితులయ్యారు. అదే ఏడాది జూలై 25న బిషప్‌గా అభిషేకం పొందారు.

అప్పటి నుంచి ఏలూరు డయాసిస్‌కు ఆధ్యాత్మిక నాయకత్వాన్ని అందిస్తున్నారు.

# సాధారణ కుటుంబం నుంచి
# ఆధ్యాత్మిక శిఖరాలకు.. బిషప్ జయరావు

- ధర్మసాగర్ ముద్దుబిడ్డ..
- ఏలూరు బిషప్ జయరావు పొలిమేర
- స్వగ్రామానికి గర్వకారణంగా నిలిచిన జయరావు
- నేడు బిషప్ జయరావు పుట్టినరోజు



**ధర్మసాగర్,ఆగస్టు 27(తెలంగాణ ముచ్చట్లు):**

ఒక చిన్న గ్రామంలో పుట్టిన వ్యక్తి.. తన ప్రతిభ, పట్టుదల, సేవాభావంతో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తే ఆ ఆనందం ఆ కుటుంబానికే కాదు.. ఆ ఊరంతటికీ సొంతం. అలాంటి గర్వకారణమైన వ్యక్తిత్వమే ఏలూరు డయాసిస్ బిషప్ మోస్ట్ రెవ. డా. జయరావు పొలిమేర.

ధర్మసాగర్ గడ్డపై 1965 ఆగస్టు 27న పి. యోబు, మరియమ్మ దంపతులకు జన్మించిన జయరావు పొలిమేర.. చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, విద్య, సేవ పట్ల ఆసక్తిని పెంచుకున్నారు. ధర్మసాగర్‌లోనే ప్రాథమిక, ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన.. అనంతరం విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేశారు.

తరువాత హైదరాబాద్‌లోని సెయింట్ జాన్స్ రీజినల్ సెమినరీలో ఫిలాసఫీ, థియాలజీ విద్యను అభ్యసించారు. 1992 ఏప్రిల్ 2న వరంగల్‌లోని ఫాతిమా కేథడ్రల్‌లో పూజారిగా అభిషేకం పొందారు. ఆధ్యాత్మిక విద్యతో పాటు న్యాయ విద్యలోనూ ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన ఎల్ఎల్‌బీతో పాటు ఇంగ్లిష్‌లో మాస్టర్స్, సంస్థాగత నాయకత్వం తదితర రంగాల్లో కూడా విద్యను అభ్యసించారు. కర్ణాటక శాస్త్రీయ సంగీతంలోనూ శిక్షణ పొందడం ఆయన బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనం.

### ఏలూరుకు ఆధ్యాత్మిక నాయకత్వం..

ఏలూరు బిషప్‌గా జయరావు పొలిమేర ఆధ్యాత్మిక సేవలకే పరిమితం కాకుండా విద్య, సామాజిక సేవ, పేదలు మరియు బలహీన వర్గాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏలూరు డయాసిస్ సామాజిక సేవా విభాగానికి ఆయన ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన బిషప్‌గా స్వీకరించిన నినాదం "Instaurare Omnia in Christo" — "Renew all things in Christ". క్రీస్తులో సమస్తాన్ని నూతనీకరించాలనే ఈ సందేశం ఆయన ఆధ్యాత్మిక దృక్పథానికి ప్రతిబింబంగా నిలుస్తోంది.




## ధర్మసాగర్‌కు గర్వకారణం..

జయరావు పొలిమేర ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా.. తన మూలాలను, తన స్వగ్రామాన్ని గుర్తు చేసుకోవడం ధర్మసాగర్ ప్రజలకు ప్రత్యేకమైన గర్వకారణం.

ధర్మసాగర్ గడ్డపై పుట్టి పెరిగిన ఒక బాలుడు.. నేడు ఏలూరు డయాసిస్‌కు బిషప్‌గా ఆధ్యాత్మిక నాయకత్వం అందించడం వెనుక ఉన్న ప్రయాణం.. ఈ తరానికి స్ఫూర్తిదాయకం.

ఒక గ్రామం నుంచి వచ్చిన వ్యక్తి తన ప్రతిభతో, విద్యతో, సేవా దృక్పథంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం.. ఆ గ్రామానికి లభించిన గౌరవం కూడా. అందుకే బిషప్ జయరావు పొలిమేర గారి పేరు వినిపించిన ప్రతిసారీ ధర్మసాగర్ ప్రజల గుండెల్లో ప్రత్యేకమైన గర్వభావం కనిపిస్తుంది.

**నేడు 61వ జన్మదినం..**

ఆగస్టు 27న బిషప్ జయరావు పొలిమేర తన 61వ జన్మదినంలోకి అడుగుపెడుతున్నారు.
ఈ సందర్భంగా ధర్మసాగర్ ప్రజలు, ఆయనను అభిమానించే వారు, శ్రేయోభిలాషులు హృదయపూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఆధ్యాత్మిక సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని..

ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని..

ధర్మసాగర్ ముద్దుబిడ్డగా ఆయన పేరు మరింత వెలుగొందాలని ఆకాంక్షిద్దాం..
ధర్మసాగర్ గడ్డపై పుట్టిన బిడ్డ..

నేడు ఆధ్యాత్మిక ప్రపంచంలో ఒక వెలుగు.బిషప్ జయరావు పొలిమేర.. మన ఊరి గర్వం..

మనందరి గర్వకారణం.హ్యాపీ బర్త్‌డే.. మోస్ట్ రెవ. డా. జయరావు పొలిమేరకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.



- పొలిమేర ప్రవీణ్ కుమార్
(రచయిత, ధర్మసాగర్)

# మోహన్ భగవత్ అమెరికా పర్యటన చర్చనీయాంశం

- వీసా అంశంపై కేఏ పాల్ వ్యాఖ్యలు
- మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో సభ

**హైదరాబాద్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అమెరికా పర్యటన అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లో 17 రోజులపాటు నిర్వహించనున్న గ్లోబల్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ఆయన అమెరికా చేరుకున్నారు. ఈ పర్యటనపై రాజకీయ, దౌత్య, సామాజిక వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ముఖ్యంగా భారతీయ ప్రవాసులు అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాల్లో ఈ పర్యటన



కు ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోంది. మోహన్ భగవత్ అమెరికా పర్యటనపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పందిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. భగవత్ అమెరికా రాకముందే కొందరు క్రైస్తవ, ముస్లిం, సిక్కు సంస్థలు ఆయన వీసాను రద్దు చేయాలని అమెరికా ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినట్లు తనకు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై అమెరికా ప్రతినిధుల్లో ఒకరు తన అభిప్రాయం కూడా కోరినట్లు ఆయన వెల్లడించారు. అయితే ప్రజాస్వామ్య దేశంలో ఎవరి పర్యటననైనా అడ్డుకోవడం సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. భావప్రకటనా స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ సమానంగా ఉండాలని తాను అమెరికా నాయకత్వానికి స్పష్టం చేసినట్లు కేఏ పాల్ తెలిపారు. వ్యక్తిగతంగా ఎవరి సిద్ధాంతాలతో విభేదాలు ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఒక వ్యక్తి లేదా సంస్థకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించడం కంటే ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ పర్యటనలో భాగంగా ఆగస్టు 29న న్యూయార్క్ నగరంలోని ప్రముఖ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో 'యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్స్' పేరిట భారీ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు, వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొనే అవకాశముందని నిర్వాహకులు చెబుతున్నారు. సభలో మోహన్ భగవత్ ముఖ్య ప్రసంగం చేయనున్నట్లు సమాచారం.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in